ప్రహరీ లేని పాఠశాలలు



ప్రహరీ లేని నాగర్‌దొడ్డి పాఠశాల

- ఆవరణలోకి పశువులు, పందులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మల్దకల్: ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు లక్షలు వెచ్చించి పాఠశాలలను నిర్మిస్తున్నా వాటికి ప్రహరీలు లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్దకల్, గట్టు, కేటీదొడ్డి, ధరూరు, గద్వాల మండలాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేవు. మల్దకల్ మండలంలో మొత్తం 10 జెడ్పీహెచ్‌ఎస్, నాలుగు యూపీఎస్, 27 పీఎస్‌లు ఉండగా, వాటిలో 6,648 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. కొన్ని పాఠశాలలను నూతనంగా నిర్మించినా వాటికి ప్రహరీలు నిర్మించకపోవడంతో ఆవరణం అపరిశుభ్రంగా మారుతోంది. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతోంది. నాగర్‌దొడ్డి, నీలిపల్లి, ఎద్దులగూడెం, దాసరపల్లి, బిజ్వారం, చిప్పదొడ్డి, విఠలాపురం, గ్రామాల్లోని పాఠశాలలతో పాటు మల్దకల్ కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వర్షాకాలంలో వర్షపునీరు పాఠశాల ఆవరణలోకి చేరడంతో పాఠశాల అపరిశుభ్రంగా తయారవుతుంది. ప్రహరీలు ఉన్న మరికొన్ని పాఠశాలలు గేట్లు లేకపోవడంతో వాటి పరిస్థితి మరీ దారుణంగా తయారైందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. కస్తూర్బా బాలికల పాఠశాలతో పాటు ఎద్దులగూడెం, బిజ్వారం పాఠశాలల ఆవరణ ముందు ప్రధాన రహదారులు ఉండటంతో విద్యార్థులు ఎప్పుడు రహదారులపైకి వెళ్లి ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీలు, గేట్లు లేని పాఠశాలలకు వెంటనే నిర్మించాలని ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ప్రహరీ లేని నీలిపల్లి పాఠశాల

సమస్యలు పరిష్కరించాలి



పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారి ఉండటంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

– ఈదన్న, మల్దకల్

నిధులు మంజూరైతే నిర్మిస్తాం..

పాఠశాలలకు ప్రహరీలు లేని విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే ప్రహరీలు నిర్మిస్తాం. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కొండారెడ్డి, ఇన్‌చార్జి ఎంఈఓ

ప్రహరీ నిర్మించాలి



మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినీలు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, గొర్రెలు, పందులు సంచరిస్తూ పాఠశాల ఆవరణం అపరిశుభ్రం చేస్తున్నాయి. ప్రహరీ నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– రామలింగం, మల్దకల్

పాఠశాల నిర్మించారు.. మరిచారు



నాగర్‌దొడ్డిలో ప్రభుత్వం కొత్తగా పాఠశాల భవనం నిర్మించి, ప్రహరీ నిర్మించలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు వెచ్చించి పాఠశాల భవనం నిర్మించిన అధికారులు ప్రహరీ నిర్మించడంపై దృష్టి సారించడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని ప్రహరీ నిర్మించాలి.

– సోమన్న, నాగర్‌దొడ్డి

రోడ్డు సమస్య పరిష్కరించండి

అలంపూర్: తమ గ్రామాల రోడ్డు సమస్యను పరిష్కరించాలని రెండు గ్రామాల ప్రజలు కోరారు. కర్నూల్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడిని ఉండవెల్లి మండలం పుల్లూరు, కలుగోట్ల గ్రామస్తులు సోమవారం కలిశారు. పుల్లూరు, కలుగోట్ల గ్రామాల ప్రధాన రహదారి నిర్మాణం పనులు రెండేళ్ల క్రితం ప్రారంభించినట్లు తెలిపారు. కంకర వేసి వదిలేసి దాదాపు ఏడాది గడిచినప్పటికీ ఇప్పటి వరకు బీటీ పనులు చేపట్టలేదన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు త్వరగా చేసే విధంగా చూడాలని కోరారు. గ్రామస్తులు మహేశ్వరెడ్డి, కాంతరెడ్డి, మజీద్ మియ్యా, మౌలాలి, సాయిబాబ, రాజు ఉన్నారు.

ఎమ్మెల్సీని, ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీఓ

అలంపూర్: కర్నూల్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడిని ఉండవెల్లి ఎంపీడీఓ జబ్బార్ సిబ్బందితో కలిశారు. ఉండవెల్లి ఎంపీడీఓగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారితో పాటు కలుగోట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ హనుమంత్ రెడ్డి, వావిలాల రంగారెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పుటాన్‌దొడ్డిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో రెండు గ్రామాల ప్రజలు

ఎంపీపీగా ప్రహ్లాదరెడ్డి లైన్ క్లియర్

అయిజ: మండలంలో ఎంపీపీ పదవి రెండేళ్లుగా ఖాళీ ఉండడంతో ఆ స్థానంలో ఎక్లాస్‌పురానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్నారు. మండలంలో ఎంపీపీగా ఉన్న ఉత్తనూరు తిరుమలరెడ్డి రెండేళ్ల క్రితం మృతి చెందడంతో వైస్ ఎంపీపీగా ఉన్న నాగేశ్వర్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీగా పనిచేశారు. ఎంపీపీ పదవీకాలం ఇంకా మూడు నెలలు ఉంది. ఈనెల 28న ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక జరగాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సోమవారం రాత్రి కర్నూల్‌లోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎంపీపీ పదవిని ఉప్పల గ్రామానికి చెందిన ప్రహ్లాదరెడ్డికి కట్టబెట్టాలని తీర్మానించారు. ఈనెల 28న జరుగనున్న ఎంపీపీ ఎన్నిక లాంఛనమే అయ్యింది.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

మల్దకల్: మండలంలో మార్చి 3న చేపట్టనున్న పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని డాక్టర్ స్వరూపారాణి వైద్యసిబ్బందికి సూచించారు. సోమవారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 0–5ఏళ్లలోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేయించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లలకు తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలను వేయించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, రమేశ్వరమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు .



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యసిబ్బందికి పల్స్‌పోలియోపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

విద్యార్థినికి అభినందనలు

శాంతినగర్: జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని సానియాను ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 24న అయిజలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో వడ్డేపల్లి మండలం రామాపురం జెడ్పీహెచ్‌ఎస్ 8వ తరగతి విద్యార్థిని సానియా ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థిని ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో ఎన్నో బహుమతులు గెలుపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

అయిజ: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో ఆరు సంవత్సరాలుగా డిగ్రీ కళాశాల కోసం వివిధ సంఘాల నాయకులు పోరాటం చేస్తున్నా ఉన్నతాధికారులు స్పందించడం లేదని వాపోయారు. డిగ్రీ చదవడానికి శాంతినగర్, గద్వాల, వనపర్తి, పెబ్బేరు, మహబూబ్‌నగర్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. వెంటనే మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చందు, చరణ్, సందీప్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అభిషేకాలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు.

శివస్వాములకు భిక్ష

ధరూరు: శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని ధరూరులో మాలాధరణ చేసిన శివ స్వాములు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయం నుంచి పాదయాత్రగా శ్రీశైలం బయలు దేరి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం శివ స్వాములకు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కుర్వ శ్రీనివాసులు భిక్ష ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణం నుంచి ధరూరులోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి, ప్రత్యేక పూజలతో స్వాములను సాగనంపనున్నట్లు అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు.

ఘనంగా మెట్ల పూజ

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో హరిహర దేవాలయం నందు సోమవారం నీలకంఠేశ్వర జ్యోతిర్లింగ మెట్ల పూజను ఘనంగా నిర్వహించారు. గద్వాలకు చెందిన శ్రీ మంజునాథ స్వరమాదురి ఆర్కెస్ట్రా వారు భక్తిగీతాలాపన చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. హసినిరెడ్డి, నరసింహారెడ్డి, రమణ, శివలు తదితరులు పాల్గొన్నారు.

మాన్‌దొడ్డి మీ సేవ కేంద్రంపై చర్యలు తప్పవు

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో మీ సేవ నిర్వహకులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరికృష్ణ అన్నారు. మాన్‌దొడ్డిలో ప్రజలకు మీసేవ అందుబాటులో ఉండటం లేదని గత వారంలో 'సాక్షి' పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై జిల్లా కేంద్రంలోని మీసేవ అధికారులు విచారణ సైతం చేపట్టారు. మీ సేవ నిర్వహకుడు వైన్ షాపులో పని చేయడంతో పాటు, ప్రత్యేకంగా ఆటోలో వెళ్లి గ్రామాల్లో బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నాడని, వచ్చిన కథనాల పట్ల సోమవారం తహసీల్దార్ స్పందించారు. ఈ విషయపై కలెక్టర్ కార్యాలయం నుంచి తనకు ఆదేశాలు వచ్చాయని, మరింత లోతుగా గ్రామంలో విచారణ చేపట్టి సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో వచ్చే వాస్తవాలను పరిగణలోకి తీసుకుని అవసరమైతే మీ సేవ కేంద్రాన్ని రద్దు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



అలంపూర్: సీఎం సహాయ నిధి ద్వారా వచ్చిన ఎల్‌ఓసీని ఎమ్మెల్సీ నివాసంలో సోమవారం ఎమ్మెల్యే విజయుడు సోమవారం అందజేశారు. రాజోలికి చెందిన తిమ్మాజీ కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. వైద్యం కోసం ఆర్థిక సాయం అందించాలని గతంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చులకు రూ.లక్ష మంజూరైనట్లు తెలిపారు. ఎల్‌ఓసీని తిమ్మాజీకి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దిలేటి ఉన్నారు.

తాగునీటి కోసం బోరు పరిశీలన

మానవపాడు: రాబోయే 30 రోజుల్లో మిషన్ భగీరథ నీటి సమస్యలొచ్చే అవకాశం ఉన్నందున్న ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తుంగభద్ర నదిలో బోర్(బావి) నిర్మాణం కోసం పరిశీలించామని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మద్దూరులో తుంగభద్ర నదిలో ఎంపీపీ అశోక్‌రెడ్డితో కలిసి నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలలో నీటి సమస్యలు లేకుండా ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఏఈ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ సంపత్‌కు ఇవ్వాలి

ఎర్రవల్లిచౌరస్తా: నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. సోమవారం ఇటిక్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలపై భౌగోళిక, ఆర్థిక, సామాజిక అంశాలపై మంచి పట్టు ఉండటంతో పాటుగా సంపత్‌కుమార్ ఎంతో విద్యావంతుడని అన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, రామచంద్రారెడ్డి, యాకోబు, రాజు, శేఖర్, సంపత్, శేఖర్, విజయ్ ఉన్నారు.

అండర్ బ్రిడ్జి వర్చువల్‌గా ప్రారంభం

ఉండవెల్లి: మండలంలోని ఉండవెల్లి శివారులోని లెవల్ క్రాసింగ్ 124లో గేట్లను తొలగించి అండర్ బ్రిడ్జిని నిర్మించగా వాటిని అమృత్ భారత్ పథకంలో భాగంగా వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు వికసిత్ భారత్‌పై వ్యాస రచనలు ప్రసంగించారు. అనంతరం డిజిటల్‌లో తిలకించారు. అలంపూర్ రైల్వే అధికారులు సంపత్, వెంకట్రమణ, సత్యనారాయణ, బీజేపీ నాయకులు పిడుగు వెంకటేష్, పటేల్ నాగేశ్వర్‌రెడ్డి, జగదీష్, సాయి, రైతు సంఘం సభ్యులు శేఖర్‌రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.



ఉండవెల్లి శివారులో రైల్వే అండర్ బ్రిడ్జిని వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం మోదీ

నేటి నుంచి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

ధరూరు: మండలంలోని అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో అంకురార్పణం, ధ్వజారోహణం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ అర్చకులు ఆద్య కేశవాచార్యులు తెలిపారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తరలి రానున్నారు. కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు.



ముస్తాబైన అల్వలపాడులోని తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి ఆలయం

విద్యాశాఖలో ఆర్పీలు క్రియాశీలకం

గద్వాల అర్బన్: విద్యాశాఖ సమగ్ర శిక్షలో పని చేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌కు సంబంధించిన 2024సంవత్సరానికి సంబంధించిన డైరీని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆవిష్కరించారు. విద్యాశాఖలో సీఆర్పీలు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఫీల్డ్ స్థాయిలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. సీఆర్పీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ సమీ, ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి శ్రీనివాసులు, రామలక్ష్మమ్మ, యుగేంధర్, నర్సింహులు, జయమ్మ ఉన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

రిజిస్ట్రేషన్ ఆలస్యంపై రైతుల ఆందోళన

గట్టు: భూ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్లాట్‌బుక్ చేసుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గట్టు శివారులోని భూ విక్రయానికి సంబంధించిన స్లాట్‌బుక్ చేసుకున్న రైతులు భూ రిజిస్ట్రేషన్ కోసం శనివారం కార్యాలయం దగ్గర ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయక పోవడంతో వెను తిరిగి వెళ్లారు. సోమవారం ఉదయం రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వివిధ గ్రామాల రైతులు చేరుకున్నారు. అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత రిజిస్ట్రేషన్ పనులు మొదలెట్టడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగవేణి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, బజారి, తిమ్మప్ప, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న రైతులు

బకాయిలు చెల్లించాలి

గద్వాల అర్బన్: అయిదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘమైన గ్రామపంచాయతీ కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉప్పేరు కృష్ణ, రాఘవేంద్ర, ఈశ్వర్, రవికుమార్, ఎల్లప్ప ఉన్నారు.

విద్యార్థులకు అన్నదానం




గద్వాల అర్బన్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం స్నిగ్ధారెడ్డి యూత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రాఘవేంద్ర కాలనీలోని అంధుల పాఠశాలలో కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

గద్వాల క్రైం: ఇటీవల కిరాణ దుకాణాలలో మొబైల్ దుకాణాలలో దొంగతనాలు జరిగి రెండు రోజులు గడవక ముందే తాజాగా మరో రెండు ఇళ్లలో ఆదివారం చోరీ చేశారు. గద్వాల పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల పట్టణంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐడీఎస్‌ఎంటీ కాలనీలో నివాసం ఉంటున్న విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు తమ అవసరాల నిమిత్తం బెంగుళూరుకు వెళ్లారు. దీంతో వారి ఇళ్లలో దొంగలు పడి 3 గ్రాముల బంగారం, కేజీ వెండి వస్తువులు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వయం పరిపాలన దినోత్సవం



గట్టు: విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం సోమవారం తుమ్మలచెరువులో నిర్వహించారు. ప్రాథమికొన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. కలెక్టర్‌గా దీక్ష, డీఈఓగా నరేష్, ఎంఈఓగా శైలజ, హెడ్మాస్టర్‌గా లోకేశ్వరి, పీఈటీగా నరేష్, ఉపాధ్యాయులుగా మరికొంత మంది విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు గోవిందు, కవిత, మహేశ్వరి, అరుంధతి, గణేష్, రమేష్ పాల్గొన్నారు.

నిధులు మళ్లించిని వారిపై చర్యలు తీసుకోవాలి

గట్టు: బల్గెరలో రైతుబంధు నిధులు మళ్లించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా కో కన్వీనర్ ప్రవీణ్‌రాజ్ డిమాండ్ చేశారు. బల్గెరకు చెందిన 64 మంది రైతులకు సంబంధించి రూ.36లక్షల రైతుబంధు నిధులను దారి మళ్లించి స్వాహా చేసిన ఏఈఓ తక్షణమే అరెస్టు చేయాలని, ఆమెకు సహకరించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్ట పోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పశువులకు వ్యాక్సిన్ వేయించండి



అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధిని అరికట్టేందుకు పశువులకు వ్యాక్సిన్ వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి కోరారు. సోమవారం మండలంలోని తూంకుంటలో పశువులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ మాట్లాడారు. ఈ వ్యాధి పశువులకు ప్రాణాంతకంగా మారుతుందని, పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. థైలెరియా వ్యాక్సిన్ థైలెరియోసిస్ అను టిక్‌బోర్న్ వ్యాధులను నివారిస్తుందన్నారు. పశువులకు వ్యాక్సిన్ వేయించాలనుకునేవారు పశువైద్యశాలలో సిబ్బందిని సంప్రదించి, వివరాలు తెలియజేయాలని వెటర్నరీ అసిస్టెంట్ కోరారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక మేళా

గద్వాల: సృజనాత్మకత ఉట్టి పడేలా వివిధ రంగాల్లో మార్పులను నమూనాల రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక మేళా ఆకట్టుకుంది. పాఠ్యాంశాల్లోని అంశాలను ప్రదర్శనల రూపంలో ఏర్పాటు చేసి సహచర విద్యార్థులను ఆకట్టుకున్నారు. అందుబాటులో ఉన్న చార్టులు, మట్టి, ఇసుక, కట్టెలు, పప్పుదినుసులు, సైన్స్ పరికరాలతో పాటు ఇతర వ్యర్థ పదార్థాలను ఉపయోగించి నమూనాలను రూపొందించారు. సుమారు వంద మంది విద్యార్థులు మేళాలో పాల్గొని తమ సృజనాత్మకతను చాటారు. వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ సురేష్ తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సవారన్న తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

అభివృద్ధిలో ప్రజలే కీలకం



రాజోళి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగే ప్రతి అభివృద్ధి పనిలో ప్రజలే కీలకమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని ముండ్లదిన్నెలో సోమవారం రూ.15 లక్షలతో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతోనే పూజలు చేయించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దింటి నాగేష్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్రామన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పక్కీరన్న, నర్సింహులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి..

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆర్ గార్లపాడులో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ భూమిపూజ చేశారు. ఇటిక్యాల మండలంలోని చాగాపురం, బట్లదిన్నె గ్రామాల్లో రూ.5లక్షల చొప్పున చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణాలకు మండలాధ్యక్షుడు రుక్మాందర్‌రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

విగ్రహ దాతకు సన్మానం

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు శివారులోని కూడళిలో ఏర్పాటు చేసిన నంది విగ్రహాన్ని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు పరిశీలించి పూజలు చేశారు. దాతను సన్మానించి త్వరలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ చిన్ని కృష్ణయ్య తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

రాజోళి: రైతుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌ను కోరారు. కొత్తగా విధుల్లో చేరిన తహసీల్దార్ హరికృష్ణను వారు సోమవారం కలిసి శాలువా పూలమాలతో సన్మానించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చే రైతులకు పలు సమస్యలు వేధిస్తున్నాయని, వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు విశ్వనాథ్ రెడ్డి, కుమార్, బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ బి జ్వారం ఫీడర్, 132 కేవీ అయిజ సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ అయిజ టౌన్ ఫీడర్‌కు సంబంధించి మంగళవారం అయిజ పట్టణంలో మరమ్మతులు చేపడుతున్నట్లు ఏడీఈ తెలిపారు. మల్దకల్ మండలంలోని బిజ్వారం, బూడిదపాడు, 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు, గద్వాల మండలంలోని కాకులారం 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు, అయిజ ఐపీడీఎస్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు అంతరాయం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హెల్మెట్ ధరించాలి

కేటీదొడ్డి: రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు రాయచూర్ నుంచి గద్వాల వైపు వెళ్తున్న వాహనాలకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చిన్నారుల ఎదుగుదలపై దృష్టి సారించాలి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధరూరు: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు రేవులపల్లి పోలీసులు తెలిపారు. జిల్లెడబండ గ్రామానికి చెందిన ఎరుకలి పెద్ద ఆంజనేయులు కొన్నేళ్ల క్రితం బతుకు దెరువు కోసం శంషాబాద్‌కు వెళ్లాడు. వారం క్రితం గద్వాలకు వచ్చి పరిసర ప్రాంతాల్లో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేశాడు. వాటిని త్రీ వీలర్ ఆటోలో తరలిస్తుండగా, రేవులపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాటిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అయిజ: తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ విజయభాస్కర్ వివరాల ప్రకారం.. మండలంలోని మేడికొండకు చెందిన చాకలి వీరేష్ కేశవరం నుంచి అయిజకు అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా మేడికొండ గ్రామం వద్ద ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. తుపత్రాలకు చెందిన బోయ రవి కేశవరం నుంచి అయిజకు ఇసుకను తరలిస్తుండగా తుపత్రాల వద్ద పోలీస్‌లు పట్టుకున్నారు. రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.